
సాక్షి పల్నాడు

శుక్రవారం । 15 । నవంబర్ । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు దిగువకు 4000 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 41.98 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



డ్వామా పీడీ శంకర్ పర్యటన

మేడికొండూరు: మేడికొండూరు మండలంలోని వివిధ గ్రామాల్లో డ్వామా పీడీ శంకర్ గురువారం విస్తృతంగా పర్యటించారు. తొలుత పేరేచర్లలోని నగరవనాన్ని సందర్శించారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల



దాచేపల్లి: మండలంలోని భట్రుపాలెం గ్రామంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం జరగనున్నది. అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

న్యూస్‌రీల్

నేడు అమరేశ్వరుని తెప్పోత్సవం



అమరావతి: కార్తికపౌర్ణమి సందర్భంగా శుక్రవారం అమరావతిలో అమరేశ్వరునికి వైభవంగా తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ సునీల్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఉత్సవ వివరాలను తెలియజేశారు. కార్తికపౌర్ణమి పర్వదినాన అమరేశ్వరాలయాన్ని సందర్శించే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా క్రమపద్ధతిలో క్యూలైన్లను ఏర్పాటు చేసి పోలీస్‌శాఖ సహకారంతో ట్రాఫిక్ నియంత్రణ, దేవాలయం, స్నాన ఘాట్‌లలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు ఉచిత ప్రసాదం, సుమారు 50వేల లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్నామన్నారు. శుక్రవారం రాత్రికి స్వామి వారి గ్రామోత్సవం, అనంతరం కృష్ణానదిలో వైభవంగా తెప్పోత్సవం, జ్వాలాతోరణం ఉత్సవం నిర్వహించటానికి వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేటటౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ గురువారం తెలిపారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతోపాటు సివిల్ కేసులు పరిష్కరించబడతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకుని విలువైన సమయం వృథా కాకుండా కాపాడుకోవాలన్నారు.

అపార్ ఐడీ కార్డుల ప్రక్రియ వేగవంతం చేయాలి

గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి



సత్తెనపల్లి: విద్యార్థులకు జారీచేసే అపార్ ఐడీ కార్డుల ప్రక్రియను వేగవంతం చేయాలని గుంటూరు ఆర్‌జేడీ ఆర్.లింగేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయం, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, 23వ వార్డులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆయన మాట్లాడుతూ అపార్ ఐడీ కార్డులు జారీకి సంబంధించి ఏ విధమైన సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. వాటిని ఎలా అధిగమించాలనే దానిపై పలు సూచనలు చేశారు. ముందుగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఆయనతోపాటు మండల విద్యాశాఖ అధికారులు ఎ.శ్రీనివాసరావు, ఎ.రాఘవేంద్రరావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

23న ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సమావేశం

బాపట్ల: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 23న గుంటూరు జెడ్పీ ఏసీ సమావేశ మందిరంలో జరుగుతుందని జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20న జరగాల్సిన సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని, 23న జరుగుతుందని వివరించారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అధ్యక్షతన జరిగే సమావేశానికి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరుకావాలని కోరారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

నరసరావుపేట తరలింపు

రాజుపాలెం: మండలంలోని కొండమోడులో గల డాక్టర్ అంజిరెడ్డి నర్సింగ్ కాలేజీలో నర్సింగ్ చదువుతున్న విద్యార్థిని గురువారం భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కేరళ రాష్ట్రానికి చెందిన విద్యార్థిని హాస్టల్‌లో ఉంటూ నర్సింగ్ చదువుతోంది. హాస్టల్ రూమ్‌లో డబ్బులు పోవడంతో ఆమెను అనుమానించడంతో మనస్థాపంతో భవనంపై నుంచి దూకినట్లు తెలిసింది. తీవ్రగాయాలు కావడంతో కోమాలోకి వెళ్లింది. పరిస్థితి విషమించడంతో నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.


మనోధైర్యమే మహా బలం

- మానసిక వికలాంగులను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలి
- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి
- పరివర్తన పాఠశాలలో చిన్నారులకు ఆటలు, క్విజ్ పోటీలు, అన్నసంతర్పణ
- విజేతలకు బహుమతులు ప్రదానం

సాక్షి దినపత్రిక, సాక్షి టీవీ ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం



మానసిక వికలాంగులతో చిట్టా విజయభాస్కరరెడ్డి, రాజవరపు, శెట్టి ఆనంద్, సతీష్, శ్రీనివాసరావు



సత్తెనపల్లి: పుట్టుకతోనే చెవిటి, మూగ, మానసిక వికలాంగులుగా జన్మించిన విద్యార్థులు బాధ పడకుండా మనోధైర్యంతో విద్యార్థి దశ నుంచే పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, సీనియర్ న్యాయవాది చిట్టా విజయభాస్కరరెడ్డి అన్నారు. సత్తెనపల్లిలోని చెవిటి, మూగ, మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో భారత తొలి మాజీ ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బ్యాంగ్ బ్రోస్ సహకారంతో సాక్షి దినపత్రిక, సాక్షి టీవీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన బాలల దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సభకు సాక్షి సత్తెనపల్లి ఆర్సీ ఇన్‌చార్జి విప్పర్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. చిట్టా మాట్లాడుతూ ఎంతోమంది తల్లిదండ్రులు అన్ని అవయవాలు బాగున్న బిడ్డలను సాకటమే కష్టమైపోతున్న ప్రస్తుత తరుణంలో పరివర్తన పాఠశాల పేరుతో చెవిటి, మూగ, మానసిక వికలాంగ విద్యార్థులను అనేక సంవత్సరాలుగా సొంత బిడ్డల్లా సాకుతున్న పరివర్తన నిర్వాహకుడు కిషోర్ బాబు కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. పరివర్తన పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న మానసిక వికలాంగులను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించి తోచిన సాయాన్ని అందించాలన్నారు. ఈ పాఠశాలకు తన సహాయం ఎప్పుడు కోరినా చేయడానికి సిద్ధమని స్పష్టం చేశారు. నిజాయితీగా వాస్తవాలను ప్రజలకు చేరవేస్తున్న సాక్షి దినపత్రిక, సాక్షి టీవీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవంలో క్రీడా పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించి మానసిక వికలాంగుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం అభినందనీయమన్నారు.

విద్యపై శ్రద్ధ వహించాలి

బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ న్యాయవాది రాజవరపు శివనాగేశ్వరరావు మాట్లాడుతూ మానసిక వికలాంగ విద్యార్థులు విద్యపైనే శ్రద్ధ వహించాలన్నారు. చదువుతోనే నేటి బాలలకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న సేవా కార్యక్రమాలను సాక్షి ప్రత్యేకంగా ప్రోత్సహిస్తుందని అభినందించారు. 22వ వార్డు కౌన్సిలర్, న్యాయవాది శెట్టి ఆనంద్ మాట్లాడుతూ నేటి పిల్లలే రేపటి భారత దేశ రూపకర్తలని, వారిని మనం పెంచే విధానమే దేశ భవిష్యత్తును నిర్దేశిస్తుందన్న చాచా నెహ్రూ మాటలు నిత్య స్మరణీయమన్నారు. బాల్యం నుంచే క్రమశిక్షణ అలవర్చుకొని ముందుకు నడవాలన్నారు. 11వ వార్డు కౌన్సిలర్ గుజర్లపూడి సతీష్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి సమాజ నిర్దేశికులన్నారు.

విజేతలు వీరే...

విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీల్లో సీనియర్స్ బాలుర విభాగంలో చైతన్యరెడ్డి (ప్రథమస్థానం), సుధీర్ (ద్వితీయ స్థానం), జడ్సన్(తృతీయస్థానం), బాలికల విభాగంలో హుసేద్దా(ప్రథమస్థానం), మాధురి(ద్వితీయ స్థానం), అనురాధ (తృతీయ స్థానం), బాలురు జూనియర్స్ విభాగంలో విజయ్ (ప్రథమస్థానం), నాగార్జున (ద్వితీయ స్థానం), జానీబాషా(తృతీయ స్థానం) గెలుపొందారు. క్విజ్ విభాగంలో అనురాధ (ప్రథమస్థానం), చైతన్యరెడ్డి (ద్వితీయ స్థానం) నాగార్జున (తృతీయస్థానం) కైవసం చేసుకున్నారు. విజేతలను అభినందించి వారికి బహుమతులను అందించారు. అంతేకాక క్రీడా పోటీల్లో భాగస్వాములైన ప్రతి విద్యార్థికి ప్రోత్సాహక బహుమతిని అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. మానసిక వికలాంగులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. గురువారం రాత్రి అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో పరివర్తన నిర్వాహకుడు కె.కిషోర్‌బాబు, సిబ్బంది, మానసిక వికలాంగులు పాల్గొన్నారు.



సీనియర్స్ విభాగంలో బహుమతులు అందుకుంటున్న బాలురు



సీనియర్స్ విభాగంలో బహుమతులు అందుకుంటున్న బాలికలు



జూనియర్స్ విభాగంలో బహుమతులు అందుకుంటున్న బాలురు



క్విజ్ పోటీల్లో బహుమతులు అందుకుంటున్న బాల,బాలికలు

వైద్యకళాశాల అభివృద్ధికి జింకానా చేయూత



విద్యార్థులకు ఎంబీబీఎస్ కాలేజ్ అడ్మిషన్ కార్డులు అందజేస్తున్న డాక్టర్ పాదిల ప్రసాద్, పక్కన ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ

- డాక్టర్ పాదిల ప్రసాద్
- వైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి జింకానా ఎంతో చేయూతనిస్తోందని గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థి, గుంటూరు జీజీహెచ్ పాదిల ప్రసాద్ మిలీనియం బ్లాక్ నిర్మాత డాక్టర్ పాదిల ప్రసాద్ అన్నారు. గురువారం గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో 2024 ఎంబీబీఎస్ అడ్మిషన్లు పొందిన వైద్య విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలు జరిగాయి. వైద్య విద్యార్థులకు కాలేజ్ అడ్మిషన్ గుర్తింపు కార్డులు, వైట్ కోట్‌లు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ పాదిల ప్రసాద్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు వైద్య కళాశాలలో అభ్యసించిన తాను ఇప్పుడు అమెరికాలో వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. వైద్య కళాశాలలో క్రమశిక్షణతో వైద్య విద్యనభ్యసించాలని, వృత్తిలో రాణించాలంటే ప్రతి ఒక్కరూ నైపుణ్యం పెంచుకోవడంతోపాటు, కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా అభివృద్ధి చేసుకోవాలన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో రూ.100 కోట్లతో నిర్మాణం జరుగుతున్న ఎంసీహెచ్ వార్డుకు గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు భారీగా విరాళాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం వేడుకలు జరుగుతున్న జింకానా ఆడిటోరియం కూడా పూర్వ వైద్య విద్యార్థుల విరాళాలతోనే నిర్మించారన్నారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి మాట్లాడుతూ ఇదే కళాశాలలో చదువుకొని తాను ప్రిన్సిపాల్‌గా ఎదిగినట్లు వెల్లడించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకరరావు, మానసిక వ్యాధుల విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమాజ్యోతి, జింకానా కో-ఆర్డినేటర్లు డాక్టర్ బాలభాస్కరరావు, డాక్టర్ హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పల్నాటి రణక్షేత్రంలో పోతురాజుకు 'పడిగెం'

కారెంపూడి: కార్తిక పౌర్ణమి శుక్రవారం పోతురాజుకు 'పడిగెం' కట్టే కార్యక్రమం జరుగుతుందని పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ గురువారం తెలిపారు. రాత్రి జ్వాలా తోరణం గుండా బ్రహ్మనాయుడు ఆయుధం నృసింహకుంతం, పల్నాటి వీరుల ఆయుధాలు (దైవాలు) వీర్ల అంకాలమ్మ తల్లిని దర్శించుకున్న అనంతరం వీరుల గుడికి తరలివెళ్లి వీరుల గుడి ముఖమండపంలో ఉన్న పోతురాజు శిలకు 101 నూలు పోగులతో పడిగెం కట్టే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ముందుగా చెన్నకేశవుని సన్నిధిలో ఉన్న నృసింహకుంతాన్ని వెలుపలికి తీసి నాగులేరు గంగధారిలో స్నానాధికాలు చేయించి అలంకారం చేసి పూజ కట్టుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం చెన్నకేశవ స్వామిని దర్శించుకుని పూజలు చేసి, రాత్రికి వీర్ల అంకాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఉన్న నగరేశ్వరస్వామి ఆలయ ముఖద్వారానికి ఏర్పాటు చేసిన జ్వాలాతోరణం గుండా పల్నాటి వీరుల ఆయుధాలు (దైవాలు) దర్శించుకున్న అనంతరం పీఠాధిపతితో వీరుల గుడి పూజారులు వీరుల గుడికి ఊరేగింపుగా చేరుకుని అక్కడ పోతురాజుకు పడిగెం కడతారు. బ్రహ్మనాయుడు నృసింహకుంతం పోతురాజుకు ఎదురుగా ఉంచి పీఠాధిపతి పర్యవేక్షణలో పూజారులు పోతురాజు శిలకు పడిగెం కట్టే క్రతువు నిర్వహిస్తారు. ఉత్సవాలు పూర్తయ్యేవరకు ప్రాంగణం వీడి వెళ్లవద్దని బ్రహ్మనాయుడు పోతురాజుకు ఆన పెట్టినట్లుగా కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం వీరుల గుడిలో అలంకరించిన ఆయుధాలు కొన్ని ఉంచి చెన్నకేశవ పీఠాన్ని గుడిలో ఉంచి ఎదురుగా జ్యోతి వెలిగిస్తారు. ఇలా పల్నాటి వీరారాధన ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం చుట్టి ఈ నెల 30 కార్తిక అమావాస్య నుంచి ఐదు రోజులపాటు జరగనున్న ఉత్సవాలకు తరలిరావాల్సిందిగా పల్నాటి వీరాచారులకు వర్తమానాలు పంపుతారు. ఇతర ఉత్సవ ఏర్పాట్లు చేయడం ప్రారంభిస్తారు.

'అల'రింతకు సిద్ధం

- కార్తిక పున్నమికి సూర్యలంక ముస్తాబు
- పుణ్యస్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు



సముద్రస్నానాల అనంతరం స్నానాలు చేసేందుకు ఏర్పాటుచేసిన షవర్లు

బాపట్లటౌన్: కార్తిక పౌర్ణమి పుణ్యస్నానాలకు శుక్రవారం భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా సూర్యలంక తీరాన్ని అధికారులు ముస్తాబు చేశారు. ప్రత్యేక ఏర్పాట్లతోపాటు వసతులు కల్పించారు. జల్లు స్నానాలకు ప్రత్యేకంగా షవర్ పాయింట్లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు 150 తాత్కాలిక గదులను సిద్ధం చేశారు. స్నానాలకు వచ్చే భక్తులు, యాత్రికులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ జి.రామాంజనేయులు సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు సముద్రంలోకి దిగకుండా జల్లు స్నానాలు చేయాలని చెప్పారు. తీరంలో ఏర్పాటుచేసిన జెండాలు దాటి సముద్రంలోకి వెళ్లరాదని పేర్కొన్నారు.

ప్రత్యేక బస్సులు

బాపట్ల నుంచి సూర్యలంక సముద్రతీరానికి వెళ్ళే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. గుంటూరు బస్టాండ్ నుంచి నేరుగా ఐదు బస్సులు సూర్యలంక తీరానికి చేరుకుంటాయని, వీటితోపాటు బాపట్ల పాతబస్టాండ్ నుంచి నేరుగా తీరం వరకు పది ఆర్టీసీ బస్సులు, రైలు మార్గాన సూర్యలంకకు చేరుకునే భక్తుల సౌకర్యార్థం రైలు సమయాలకు అనుగుణంగా రైల్వేస్టేషన్ నుంచి రెండు బస్సులను నడుపుతున్నట్టు బాపట్ల ఆర్టీసీ డీఎం శ్రీమన్నారాయణ తెలిపారు.

తీరంలోని తోటలూ సిద్ధం

పుణ్యస్నానాలు అనంతరం వనభోజనాలకు తీరానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జీడిమామిడి తోటలు, వననర్సరీలోని నేరుడు చెట్ల కింద అధికారులు ఏర్పాట్లు చేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏకో రిసార్ట్స్ కూడా ఇక్కడ అందుబాటులో ఉంది. తీరంలో ఉన్న తారకేశ్వరస్వామి దేవాలయంతోపాటు, ఆంజనేయస్వామి ఆలయం, నవగ్రహాలు ప్రత్యేక పూజలకు సిద్ధమయ్యాయి.

పటిష్ట బందోబస్తు

పుణ్యస్నానాల నేపథ్యంలో తీరంలో 316 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. తీరాన్ని సీసీ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. బందోబస్తు నిమిత్తం జిల్లా నలుమూలల నుంచి ఇద్దరు డీఎస్పీలు, 8 మంది సీఐలు, 16 మంది ఎస్ఐలు, వీరితోపాటు కానిస్టేబుళ్లు కలిపి మొత్తం 316 మంది బందోబస్తు విధులు నిర్వర్తించనున్నారు. సూర్యలంక నుంచి బాపట్ల వరకు ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టనున్నట్టు రూరల్ సీఐ తెలిపారు. ముందు జాగ్రత్తగా గజ ఈతగాళ్ల బృందాలను సిద్ధం చేశారు. 15వైద్య బృందాలను అందుబాటులో ఉంచారు.

నాలుగు బీచ్‌ల వద్ద బందోబస్తు


కార్తిక పౌర్ణమి సందర్భంగా నాలుగు బీచ్‌ల వద్ద 400 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు ఎస్పీ తుషార్ డూడీ చెప్పారు. గురువారం రాత్రి జిల్లాలోని సూర్యలంక, రామాపురం, ఓడరేవు, నిజాంపట్నం సముద్రతీర ప్రాంతాల్లో బందోబస్తుపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

నేటి నుంచి వీవీఐటీలో బాలోత్సవ్





బాలోత్సవ్ వేడుకలకు ముస్తాబైన నంబూరు వీవీఐటీ కళాశాల



వాసిరెడ్డి విద్యాసాగర్, చైర్మన్ వీవీఐటీ కళాశాల

పెదకాకాని: చిన్నారుల్లో సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించడమే బాలోత్సవ్ ముఖ్య ఉద్దేశమని వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ చెప్పారు. పెదకాకాని మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఈనెల 15 శుక్రవారం నుంచి బాలోత్సవ్-2024 నిర్వహించనున్నట్టు వెల్లడించారు. మూడు రోజులపాటు ఈ ఉత్సవం జరుగుతుందని వివరించారు. దీనికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. బాలోత్సవ్‌లో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా 650 పాఠశాల నుంచి 13 వేలమంది విద్యార్థులు ఇప్పటికే తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. 20 అంశాలు, 61 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని, దీనికోసం వీవీఐటీ ప్రాగణంలో 30 వేదికలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇతర రాష్ట్రాలు, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు సహాయం చేసే నిమిత్తం గుంటూరు, విజయవాడ నగరాల్లోని బస్టాండ్, రైల్వే స్టేషన్లలో సేవా కేంద్రాలు ఏర్పాటు చేశామని, వారిని కళాశాల బస్సుల ద్వారా బాలోత్సవ్ ప్రాంగణానికి తరలిస్తామని చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచిత వసతి, భోజన ఏర్పాట్లూ చేస్తున్నామని పేర్కొన్నారు. కళాశాలకు చెందిన స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో 600 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపడతారని వెల్లడించారు. 300 మంది ఎన్‌సీసీ విద్యార్థులు రక్షణ బాధ్యతలు తీసుకుంటారని వివరించారు. వేల సంఖ్యలో విద్యార్థులు పాల్గొంటున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరిగేతే ఎదుర్కొనేందుకు ముందు జాగ్రత్తగా పెదకాకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గుంటూరు ఆస్టర్ రమేష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అంబులెన్సును ఏర్పాటు చేశామన్నారు. బాలోత్సవ్‌లో పాల్గొనే వారు తమ వెంట జనరల్ మెడిసిన్స్‌తోపాటు బాలోత్సవ్ కమిటీ నిర్ణయం మేరకు ప్లాస్టిక్ రహిత వాటర్ బాటిల్‌ను తెచ్చుకోవాలని కోరారు.

క్లుప్తంగా

హైందవ శంఖారావం సన్నాహక సమావేశం



రొంపిచర్ల: దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కలిగించేలోగా దేవాలయాల నిర్వహణలో సమస్కరణల డిమాండ్ కోసం జనవరి 5వ తేదీ విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగసభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ సహ బౌధిక్ ప్రముఖ్ కొత్తా వెంకటరామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక కన్యాకా పరమేశ్వరి ఆలయంలో గురువారం నిర్వహించిన సన్నాహాక సమావేశంలో ఆయన మాట్లాడారు. డిమాండ్లతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నరసరావుపేట ఖండ కన్వీనర్ మారెళ్ల శ్రీనివాసరెడ్డి, గొడవర్తి వెంకటేశ్వర్లు, బలరామరాజు, కోటేశ్వరరావు, పలు క్షేత్రాల నాయకులు, కార్యకర్తలు, పలు హిందూ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాచర్ల ప్యాసింజర్‌లో మందుబాబు వీరంగం



సత్తెనపల్లి: మందుబాబు వీరంగం సృష్టించిన సంఘటన మాచర్ల నుంచి విజయవాడ వెళ్లే ప్యాసింజర్ రైలులో గురువారం జరిగింది. రైలు భోగీలో ప్రయాణిస్తున్న విద్యార్థినులను వచ్చి రాని ఇంగ్లీష్‌లో దుర్భాషలాడుతూ చెయ్యి చేసుకున్నాడు. వాటర్‌బాటిల్‌లో శీతలపానీయం, మద్యం కలిపి సేవిస్తూ మద్యం మత్తులో అసభ్యకరంగా మాట్లాడుతూ వీరంగం సృష్టించాడు. సమాచారం అందుకున్న సత్తెనపల్లి రైల్వే స్టేషన్ మాస్టర్ వెంకట్‌రెడ్డి వెంటనే స్పందించి తన సిబ్బందితో సత్తెనపల్లికి చేరుకున్న భోగీ వద్దకు వెళ్లి అతనిపై తగిన చర్యలు తీసుకున్నారు. దీంతో రైలు భోగీలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు స్టేషన్ మాస్టరు వెంకటరెడ్డి సేవలను ప్రశంసించారు.

వర్సిటీ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక



వర్సిటీ మహిళా కబడ్డీ జట్టు క్రీడాకారులతో టోర్నమెంట్ నిర్వాహకులు

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళా కబడ్డీ టోర్నమెంట్, వర్సిటీ జట్టు ఎంపిక పోటీలు రెండు రోజులుగా కృష్ణవేణి కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. వర్సిటీ జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను గురువారం కళాశాల ప్రిన్సిపల్, టోర్నమెంట్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈదర ఆదిబాబు ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, వీరరాఘవులు, వైస్ ప్రిన్సిపల్ ఎం.ఆర్.కె.సతీష్‌బాబు, టోర్నమెంట్ పరిశీలకుడు డాక్టర్ డి.సూర్యనారాయణరావు, సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ చుండు వెంకట్రావు, డాక్టర్ కె.అరుణసుజాత, పి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా జట్టు ఇదే...

ఎం.త్రివేణి, ఎం.కావేరి, సీహెచ్.హేమలత (కృష్ణవేణి డిగ్రీ కళాశాల, నరసరావుపేట), వి.పుష్ప, టి.ప్రమీల (వర్సిటీ కళాశాల), డి.హేమలత, పి.హేమలత (జెఎంజె కళాశాల, తెనాలి), జి.హర్షిత (విక్టరీ డిగ్రీ కళాశాల, నరసరావుపేట), కె.ఆదిలక్ష్మి (వాగ్దేవి డిగ్రీ కళాశాల, నరసరావుపేట), కె.రత్నకుమారి (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఒంగోలు), పి.యమున (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గుంటూరు), కె.శాంతకుమారి (ధనలక్ష్మి కళాశాల, ఏ.ముప్పాళ్ల), స్టాండ్ బై క్రీడాకారులుగా పి.లక్ష్మి, ఎస్.నీలిమ, ఏ.గోపీశివమయి ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29వ తేదీ నుంచి తమిళనాడు కారైకుడిలోని అలగప్ప విశ్వవిద్యాలయంలో జరగనున్న సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా కబడ్డీ పోటీలలో ఏఎన్‌యూకు ప్రాతినిధ్యం వహించనున్నట్టు టోర్నమెంట్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు.

అందుబాటులోకి ఆయుర్వేద వైద్య సేవలు

వైద్యశాలకు హాజరైన వైద్యురాలు

సాక్షి ఎఫెక్ట్

పిడుగురాళ్ల: ఎట్టకేలకు ఆయుర్వేద వైద్యశాల తలుపులు తెరచుకున్నాయి. వైద్యురాలు గురువారం విధులకు హాజరయ్యారు. ఆయుర్వేద వైద్యాన్ని ఏడాదిపాటు కూటమి ప్రభుత్వం దూరం చేయటంతో ఈనెల 6వ తేదీన సాక్షి దినపత్రికలో 'ఆయుర్వేదం... దూరం' అనే శీర్షికన కథనం ప్రచురించిన సంగతి పాఠకులకు విదితమే. ప్రభుత్వం స్పందించి డిప్యూటేషన్‌పై వెళ్లిన వైద్యురాలు మేఘమాల ఈనెల 10వ తేదీన పిడుగురాళ్ల పట్టణంలోని ఆయుర్వేద వైద్యశాలలో విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో వైద్యురాలు గురువారం విధులకు హాజరయ్యారు.



ఆయుర్వేద వైద్యశాల

అటెండర్ బాబు కూడా విధులకు హాజరయ్యారు. ఆయుర్వేద వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరడంతో బాగు చేయించేందుకు, వైద్యశాల ప్రాంగణంలో మరో అదనపు గది నిర్మించేందుకు దాతలు ముందుకు వచ్చారు. గది నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నాలుగు రోజుల్లో గది నిర్మాణం కూడా పూర్తవుతుంది. అప్పటి నుంచి రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుతాయని వైద్యురాలు తెలిపారు.

సినీనటి శ్రీరెడ్డిపై ఫిర్యాదు

చిలకలూరిపేట: సినీనటి శ్రీరెడ్డిపై తెలుగు మహిళా విభాగం నాయకులు చిలకలూరిపేట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లపై సోషల్ మీడియాలో అసభ్యకర పదజాలంతో పోస్టింగులు పెట్టారంటూ ఫిర్యాదు చేశారు. శ్రీరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ జరీనా సుల్తానా, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అమరా రమాదేవి, ప్రధాన కార్యదర్శి పోపూరి లక్ష్మి తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. వారు పట్టణ ఎస్‌ఐ డి చెన్నకేశవులను కలిసి ఫిర్యాదు అందజేశారు. ఈ విషయమై పట్టణ ఎస్‌ఐ చెన్నకేశవులను వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, విచారణ నిర్వహిస్తామని తెలిపారు.

జాతీయ పోటీలకు ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థులు



కె.శివసాకేత్



వై.మధుకిషోర్

నరసరావుపేట ఈస్ట్: జాతీయ స్థాయి 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్–2024 స్విమ్మింగ్ పోటీలకు శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు గురువారం తెలిపారు. ఇటీవల కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన అండర్–19 బాలుర స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీలో తమ విద్యార్థులు వై.మధుకిషోర్, కె.శివసాకేత్‌లు వివిధ విభాగాలలో పతకాలు సాధించి జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్‌లో ఈనెల 24వ తేదీ నుంచి జరగనున్న 68వ జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ స్విమ్మింగ్ పోటీలో తమ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, అధ్యాపకులు అభినందించారు.

ఇంజక్షన్ వికటించి మహిళ మృతి

- మృతురాలి బంధువుల ఆందోళన
- ప్రసవం కోసం ఆస్పత్రికి వచ్చిన మహిళ
- చిన్నారి జననం



జన్మించిన చిన్నారి



మృతి చెందిన ఇద్దమ్మ

మాచర్ల: పట్టణంలోని కమ్యూనిటీ ఆసుపత్రిలో వెల్దుర్తి మండలం వజ్రాలతండాకు చెందిన జె.ఇద్దమ్మ (27) ఐదో కాన్పుకు వచ్చింది. వచ్చిన గంట తరువాత చిన్నారి పాపకు జన్మిచ్చింది. వైద్యులు ఇచ్చిన ఇంజక్షన్ వికటించి ఇద్దమ్మ మృతిచెందింది. ఇద్దమ్మ మృతికి వైద్యులు కారణమంటూ మృతురాలి బంధువులు, గ్రామ ప్రజలు ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. వైద్యులు సరైన చికిత్స అందిస్తే మృతిచెందేది కాదంటూ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయభాను, అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.చారిలను నిలదీశారు. వైద్య సేవలు వైద్యులు సరిగా అందజేయడం జరిగిందన్నారు. ఇద్దమ్మ రక్తహీనత కారణంగా అనారోగ్యానికి గురై మృతి చెందిందని, వైద్యుల నిర్లక్ష్యం కాదని సూపరింటెండెంట్ చెప్పారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ ప్రభాకరరావు బాధితుల నుంచి వివరాలు సేకరించారు. వైద్యులతో చర్చించి సంఘటన వివరాలు నమోదు చేసుకున్నారు. జన్మించిన చిన్నారి సురక్షితంగా ఉంది. దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఆందోళనకారులకు పోలీసులు సర్దిచెప్పారు.

భవనం పైనుంచి జారిపడి వలస కార్మికుడి మృతి



క్రాంతి మృతదేహం

భూదాన్‌పోచంపల్లి: ప్రమాదవశాత్తూ భవనం పైనుంచి జారి పడి వలస కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసరావుపేటకు చెందిన గుంజి శివకుమారి భర్త చనిపోవడంతో బతుకుదెరువు నిమిత్తం ఆమె తన ఇద్దరు కుమారులను తీసుకొని ఆరేళ్ల కిందట బీబీనగర్‌కు వలస వచ్చింది. వీరు చుట్టుపక్కల గ్రామాల్లో భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు గ్రామానికి చెందిన కోతులారం శ్రీకాంత్ నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి ప్లాస్టరింగ్ చేయడానికి శివకుమారి పెద్దకుమారుడు గుంజి క్రాంతి(29) వచ్చాడు. గోవా కర్రల పైకి ఎక్కి భవనానికి ప్లాస్టరింగ్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తూ కాలు జారి కింద ఉన్న బేస్‌మెంట్ రాయిపై పడ్డాడు. ఈ ప్రమాదంలో క్రాంతికి కణత భాగంలో గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే అక్కడే పనిచేస్తున్న తోటి కార్మికులు గమనించి గుత్తేదారు మేస్త్రీ శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.భాస్కర్‌రెడ్డి తెలిపారు.

15 మండలాల్లో వర్షపాతం నమోదు

అత్యధికంగా ముప్పాళ్లలో 36.4 మి.మీటర్లు

నరసరావుపేట: జిల్లాలోని 28 మండలాల్లో బుధవారం నుంచి గురువారం నాటికి 15 మండలాల్లో 152.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలియచేశారు. అత్యధికంగా ముప్పాళ్ల మండలంలో 36.4 మి.మీ వర్షం పడగా, కారెంపూడిలో 4.2, పిడుగురాళ్లలో 16.4, మాచవరంలో 2.2, బెల్లంకొండలో 26.6, అచ్చంపేటలో 4.2, క్రోసూరులో 7.6, సత్తెనపల్లిలో 21.4, రాజుపాలెంలో 9.0, బొల్లాపల్లిలో 1.2, వినుకొండలో 2.8, శావల్యాపురంలో 1.6, ఈపూరులో 0.8, రొంపిచర్లలో 8.2, నరసరావుపేటలో 4.6, చిలకలూరిపేటలో 4.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చీరాల–వేటపాలెం రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకున్నట్లు జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపారు. మృతుడి వయస్సు 50 ఏళ్లు ఉంటాయని, డౌన్‌లైన్‌లో రైలు ఢీకొనడంతో మృతి చెందాడనే సమాచారంతో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించామని చెప్పారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు కొత్తపేట విద్యార్థులు



వేటపాలెం: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు కొత్తపేట విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు గుమ్మా శ్రీనివాసరావు గురువారం తెలిపారు. పాఠశాల నుంచి కే ఏశోబు, ఎస్ శ్రావణి, వీ వెంకట చరణ్, ఎస్ జయచంద్రిక, బీ జోషిరాజు, ఈ. వెంకాయమ్మ ఎంపికవడంతో వారిని అభినందించారు. విద్యార్థులను స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు గవిని నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

పోసానిపై ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు

మాచర్ల రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడుపై సినీ నటుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోసాని మురళీకృష్ణ అసభ్యకరమైన అనుచిత వ్యాఖ్యలు చేశాడని అతనిపై కేసు నమోదు చేయాలంటూ స్థానిక టీడీపీ నాయకులు రూరల్ సీఐకి ఫిర్యాదు చేశారు. గురువారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ షేక్ నఫీఫ్ బాషాను రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి కుర్రి శివారెడ్డి పోసాని మురళీకృష్ణ బీఆర్ నాయుడుపై చేసిన వ్యాఖ్యలు కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని, అతనిపై చర్యలు తీసుకోవటం కోసం కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వజ్రం నాయక్, గంధం మల్లయ్య, తోటా వీరాంజనేయులు, రాంబాబు, పిన్నంశెట్టి కృష్ణ, నాయకులున్నారు.

చిలకలూరిపేట పోలీస్‌స్టేషన్‌లో..

చిలకలూరిపేట: సినీ రచయిత, నటుడు, దర్శకుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు పోసాని కృష్ణమురళిపై చిలకలూరిపేట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, టీవీ–5 అధినేత, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడులపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదులో టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని చిలకలూరిపేట పట్టణ ఎస్‌ఐ డి చెన్నకేశవులుకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు బొబ్బిళ్ల ప్రసాద్(నిమ్మకాయల ప్రసాద్), తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మద్దిబోయిన శివ, నాయకులు మద్దుమాల రవి, జంగా వినాయకరావు తదితరులు ఉన్నారు.

దేశ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర కీలకం

సహకార శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ రామమోహనరావు



ప్రతిజ్ఞ చేస్తున్న సహకార ఉద్యోగులు

నరసరావుపేట ఈస్ట్: ఉజ్వల భారతదేశ నిర్మాణంలో సహకార సంఘాలు కీలకపాత్ర నిర్వహిస్తున్నాయని విజయవాడ సహకార శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ ఎం.రామమోహనరావు తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని డివిజనల్ సహకార అధికారి కార్యాలయంలో గురువారం 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామమోహనరావు మాట్లాడుతూ సహకార సంఘాల ప్రాధాన్యతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసి నిర్మాణాత్మక చర్యలు చేపట్టిందని వివరించారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న వారోత్సవాలలో పలు అంశాలపై కార్యక్రమాలు నిర్వహించి సహకార రంగాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని తెలిపారు. సహకార సంఘాల ద్వారా గోడౌన్‌ల నిర్మాణం, పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు, కోల్డ్ స్టోరేజీలు, గ్యాస్ స్టేషన్‌లు వంటి ఆర్థిక ప్రయోజనాలతో కూడిన అభివృద్ధి కొనసాగుతున్నదన్నారు. సహకార పతాకాన్ని ఎగురవేసి ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా సహకార తనిఖీ అధికారి డి.శ్రీనివాసరావు, ఉప విభాగేయ అధికారి స్వర్ణ చినరామిరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు జేపీడీ టాండన్, షేక్.రహంతుల్లా, కె.అంజమ్మ, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

జన జాతీయ గౌరవ దివస్ ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

విజయపురిసౌత్: మాచర్ల మండలం బెల్లంకొండవారిపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు గురువారం సందర్శించారు. పాఠశాలలో శుక్రవారం జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమం నిర్వహించనున్నారు. భారత ప్రభుత్వం గిరిజన హక్కుల కోసం, వారి భూముల కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు గిరిజన నాయకుడు బిర్సాముండా జయంతి రోజైన నవంబర్ 15న ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితి. బిర్సాముండా 150వ జయంతిని ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఉత్సవాలలో భాగంగా చెంచులగూడెలలో మౌలిక సదుపాయాల కల్పన, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం తలపెట్టిన జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ పథకం తొలి సంవత్సరం విజయవంతంగా పూర్తి చేసుకుంది. దీనిలో భాగంగా తొలి వార్షికోత్సవ ఉత్సవాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా ప్రవేశపెట్టిన దర్తి అభాజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమం ఐఈఎస్ ప్రచారం ద్వారా ఈ పథకం అమలవుతున్న గ్రామాలలో చేపట్టే విధంగా ఈ కార్యక్రమం ప్రారంభించబడుతుందన్నారు. అందులో భాగంగా కలెక్టర్ అరుణ్‌బాబు ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ అధికారులకు, ఉపాధ్యాయులకు ప్రోగ్రాంపై పలు సూచనలు చేశారు. నియోజకవర్గ పరిధిలోని గిరిజనులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ కోరారు. ఆయన వెంట డీటీడబ్ల్యూఓ వరలక్ష్మి ఉన్నారు.

రూ.1.14 లక్షల రికవరీకి ఆదేశం

- రూ.7.80 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులు
- రూ.24.99 లక్షల తేడా గుర్తింపు



వివరాలు వెల్లడిస్తున్న డ్వామా పీడీ ఎం.సిద్ధలింగమూర్తి పక్కన పలువురు అధికారులు

నకరికల్లు: ఉపాధి పనుల్లో వెలుగులోకి వచ్చిన తేడాలు గుర్తించి రికవరీకి ఆదేశిస్తామని డ్వామా పీడీ ఎం. సిద్ధలింగమూర్తి అన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రజావేదిక నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టింది. గ్రామసభల ద్వారా పలు వివరాలు సేకరించారు. ప్రజావేదిక గ్రామాల వారీగా గుర్తించిన తేడాలను తనిఖీ బృందం వెల్లడించింది. ప్రజావేదిక అనంతరం ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 3,27,533 పనిదినాలు కల్పించి రూ.7.80 కోట్లు వెచ్చించినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో రూ.24లక్షల 99వేలు తేడాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. మొత్తం మీద రూ.1,14,758 రికవరీకి ఆదేశించామన్నారు. సంబంధించిన వారికి నేరుగా నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి బి.బాలునాయక్, విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి, క్వాలిటీ కంట్రోల్ అధికారి ప్రభాకర్, ఎస్ఆర్‌పి ఎం.లోకేష్, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న సాగర్ మేజర్ కాల్వల మరమ్మతులు



కాల్వలో పూడిక తీస్తున్న జేసీబీ

కారెంపూడి: మండలంలోని సాగర్ మేజర్ కాల్వల మరమ్మతు పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం పెదకొదమగుండ్ల మేజర్ కాల్వ మరమ్మతు పనులు చేపట్టారు. రెండు జేసీబీలతో కాల్వ కట్టలపై ఉన్న కంప చెట్లు తొలగించడంతోపాటు కాల్వలో ఉన్న నాచు జమ్ముతోపాటు మట్టి పూడిక తీసే పనులు చేస్తున్నారు. సాగర్ కుడి కాల్వ ప్రారంభం నుంచి మేజర్ కాల్వను బాగుచేసే పనులు ప్రారంభించారు. సాయంత్రానికి కాల్వ జమ్మి చెట్టు వరకు పనులు జరిగాయి. రేపటికల్లా మేజర్ కాల్వ మరమ్మతు పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. కారెంపూడి ఓఅండ్ఎం సబ్‌డివిజన్ పరిధిలోని 8 మేజర్ కాల్వల మరమ్మతు పనులు జరుగుతున్నాయని ఏఈ తెలిపారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి రైతుల ఇబ్బందులు గమనించి ప్రత్యేక శ్రద్ధతో రైతులకు సక్రమంగా సాగు నీరందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో పనులు చేయిస్తున్నామని అధికారులు చెప్పారు. ఇదిలా ఉంటే 'కాల్వలు ఇలా.. సాగునీరందేదెలా' శీర్షికన గతంలో సాక్షిలో కథనం వచ్చింది. కాల్వల దుస్థితిపై చివరి భూముల రైతులకు నీరందని పరిస్థితిని వివరించడం జరిగింది. ప్రస్తుతం మరమ్మతు పనులు జరుగుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతు పనులు జరుగుతుండడంతో కాల్వకు నీరు ఆపామని శుక్రవారం నీరు విడుదల చేయనున్నట్లు అధికారులు చెప్పారు.

సముద్ర తాబేళ్లను రక్షించాలి



తాబేళ్ల రక్షణకు కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న అధికారులు

వేటపాలెం: తాబేళ్ల రక్షణ బాధ్యతను మత్స్యకారులు తీసుకోవాలని ఇండియన్ కోస్ట్‌గార్డు అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ శివబాలన్ పేర్కొన్నారు. మండలంలోని రామాపురం సముద్ర తీరంలోని కోస్ట్ రిసార్ట్‌లో ట్రీ ఫౌండేషన్ అధ్వర్యంలో ఐటీసీ బంగారు భవిష్యత్ సౌజన్యంతో 'మడ అడవుల పెంపకం, సంరక్షణ– సముద్ర తాబేళ్ల రక్షణ' అంశంపై వర్క్‌షాపు గురువారం నిర్వహించారు. ఇందులో శివబాలన్ మాట్లాడుతూ... మత్స్యకారులు సముద్ర తాబేళ్లను సంరక్షించడం వల్ల అవి మత్స్య సంపదకు దోహద పడతాయని తెలిపారు. ఎఫ్‌డీఓ రవీంద్ర మాట్లాడుతూ మడ అడవులు ఉన్న ప్రాంతంలో మత్స్య సంపద పెరుగుతుందని చెప్పారు. అడవులు గ్రామాలకు రక్షణగా ఉంటాయని తెలిపారు. ట్రీ ఫౌండేషన్ చైర్ పర్సన్ సుప్రజ ధరిణి మాట్లాడుతూ 2002లో ట్రీ ఫౌండేషన్ ద్వారా సముద్ర తాబేళ్ల రక్షణకు నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. టేకు వల వాడకం వలన సముద్ర తాబేళ్లు చనిపోతున్నాయని చెప్పారు. ఐటీసీ సీనియర్ ప్రోగ్రాం అధికారి సాయి గౌతం మాట్లాడుతూ సూర్యలంక, ఏటిమొగ, పొట్టి సుబ్బయ్యపాలెంలో మడ మొక్కల నర్సరీ అటవీ శాఖ సహకారంతో పెంచుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా సమన్వయ కర్త శవనం చంద్రారెడ్డి, అటవీ శాఖ సెక్షన్ అధికారి వెంకటేశ్వర్లు, శిరీష, మునిమ్మ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల కాలపరిమితిని తగ్గించాలి

పింఛన్ దారుల సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పి.కేశవరెడ్డి

గుంటూరు మెడికల్: విశ్రాంత ఉద్యోగుల కమిషన్ చెల్లింపు కాల పరిధిని 15 సంవత్సరాల నుండి 10 సంవత్సరాలకు తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ పింఛన్ దారుల సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పి.కేశవరెడ్డి అన్నారు. గురువారం గుంటూరు వైద్య కళాశాల ఆవరణంలోని అసోసియేషన్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగ పెన్షన్‌దారుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. కేశవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసి పదవీ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చే కమ్యూటేషన్ కాల పరిమితిని తిరిగి చెల్లించే పరిధిని తగ్గించాలని కోరారు. పంజాబ్ రాష్ట్రంలో 15 నుంచి 10 సంవత్సరాలు, హర్యానాలో 12, గుజరాత్‌లో 13 సంవత్సరాలకు కాల పరిమితి తగ్గించారన్నారు. అదే తరహాలో ఏపీలో 10 సంవత్సరాలకు తగ్గించాలని కోరారు.